ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



తమిళనాడు
TAMILNADU

ఆదివారం 22 సెప్టెంబరు 2024



మద్య నిషేధం సాధ్యమేనా?

- టాస్మాక్ ద్వారా ఏడాదికి రూ.50 వేల కోట్ల ఆదాయం
- ఇంత రాబడి ప్రభుత్వం వదులుకుంటుందా?
- అంత సాహసానికి ఒడిగట్టే నేతలున్నారా?

(ఆంధ్రజ్యోతి, చెన్నై)

ఒకవైపు ఏడాదికి రూ.50 వేల కోట్లకు పైగా ఆదాయం.. మరోవైపు మద్యానికి బానిసలైన మందుబాబుల ఒత్తిడి.. ఆదాయం లేకుండా ప్రభుత్వం నడపడం కష్టం.. మందుబాబులు ఆగ్రహిస్తే ఓట్లు రాలవేమోనన్న భయం.. ఇలాంటి పరిస్థితుల్లో ఏ ప్రభుత్వమైనా మద్య నిషేధానికి ఒడిగడుతుందా?.. ఏ పార్టీ అయినా ఆ దిశగా సాహసిస్తుందా?.. ఏ నేత అయినా తెలిసితెలిసీ ముళ్లబాటను ఎంచుకుంటారా?.. ఏమో అనుమానమే!.. డీపీఐ నేతృత్వంలో త్వరలో జరుగనున్న 'మద్య నిషేధ మహానాడు'తో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాల్లో రేగిన రచ్చపై తీవ్ర చర్చ రేగుతోంది. ఈ నేపథ్యంలో ఈ నిషేధం అమలు సాధ్యాసాధ్యాలను పరిశీలిద్దాం..

రాష్ట్రంలో మద్యపానం...

రాష్ట్రంలో మద్యం అలవాటు రాజుల కాలం నుంచే ఉంది. 1937వ సంవత్సరంలో మద్రాసు ప్రెసిడెన్సీని పాలించిన రాజాజీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మద్యనిషేధం అమలు చేసింది. అనంతరం 1971లో డీఎంకే ప్రభుత్వం మద్య నిషేధాన్ని సడలించింది. అనంతరం 1974లో మళ్లీ అధికారం చేపట్టిన డీఎంకే.. మద్య నిషేధాన్ని అమలు చేసింది. అనంతరం 1981లో అన్నాడీఎంకే ప్రభుత్వం నిషేధంపై సడలించింది. ఆ తరువాత మద్యం విక్రయాలు క్రమబద్ధీకరించి 1983లో తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్ (టాస్మాక్) ఆధ్వర్యంలో హోల్‌సేల్ మద్యం విక్రయాలను అన్నాడీఎంకే ప్రభుత్వం ప్రారంభించింది. అనంతరం మద్య నిషేధ చట్టంలో సవరణలు చేపట్టి టాస్మాక్ సంస్థ చిల్లర విక్రయాలు చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఆ ప్రకటనతో ప్రైవేటు సంస్థల మద్యం విక్రయాలకు చెక్ పడినట్లయింది. అప్పటి నుంచి రాష్ట్రప్రభుత్వ ఆదాయ వనరుగా టాస్మాక్ సంస్థ నిలిచింది.

మద్య నిషేధ గళం...

మధ్యమధ్యలో పలువురు మద్యాన్ని నిషేధించాలంటూ గళం విప్పారు. 2015, 2016లో ప్రజలే స్వచ్ఛందంగా మద్య నిషేధంపై ఆందోళనలు చేపట్టారు. ఈ ఆందోళనలు ఆయా పార్టీలకు తలనొప్పిగా మారాయి. మద్య నిషేధం అమలు చేసిన సమయంలో నాటుసారా ఏరులైపారింది. అంతేగాక పొరుగు రాష్ట్రాల నుంచి కూడా అక్రమ మద్యం ప్రవహించింది. కల్తీసారాతో మరణాలూ పెరుగుతూ వచ్చాయి. ఈ వ్యవహారాలను అడ్డుకోవడం ప్రభుత్వాలకు తలకు మించిన భారంగా మారింది. ఒకవైపు ఆదాయం కోల్పోవడంతో పాటు మరోవైపు కల్తీ సారా మరణాలు ప్రభుత్వాలకు చికాకు తెప్పించాయి. అలాంటిది ఇప్పుడు మళ్లీ మద్య నిషేధం అమలు సాధ్యమయ్యే పనేనా అని 2016 నాటి అన్నాడీఎంకే పాలకులు తలలు పట్టుకున్నారు. నిజానికి దేశంలోని 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకుగాను మూడునాలుగు రాష్ట్రాల్లోనే మద్యనిషేధం స్వల్ప స్థాయిలో అమలవుతోంది. మద్యనిషేధం అమలులో ఉన్న రాష్ట్రాల్లో నేరాలు తగ్గినట్లు సర్వేలు చెబుతున్నాయి. అయితే నిషేధం అమలు చేయడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నానా తంటాలు పడుతున్నాయి.

రోడ్డున పడనున్న 65 వేల మంది...

రాష్ట్రంలో టాస్మాక్ సంస్థ మద్యం దుకాణాలు నిర్వహిస్తుండగా, దాని ఆదాయం ప్రభుత్వానికే వెళుతోంది. రాష్ట్రంలో 2024-25 సంవత్సర బడ్జెట్ రూ.3 లక్షలా 48 వేలా 289 కోట్లు కాగా అప్పులు రూ.8 లక్షలా 22 వేల కోట్లు. అదే సమయంలో మద్యం ద్వారా సమకూరే ఆదాయం రూ.52,733 కోట్లుగా తేలింది. 2016లో అధికారం చేపట్టిన అన్నాడీఎంకే.. ఎన్నికల హామీల్లో ఒకటిగా ఉన్న విడతల వారీగా మద్యం దుకాణాల మూసివేతలో భాగంగా 1,000 దుకాణాలు మూసివేసింది. ఆ తర్వాత రాష్ట్రంలో 5,329 మద్యం దుకాణాలుండగా, ప్రస్తుత డీఎంకే పాలనలో గత ఏడాది 500 మద్యం దుకాణాలు మూసివేశారు. ప్రస్తుతం 4,829 మద్యం దుకాణాలు పని చేస్తున్నాయి. అందులో సూపర్‌వైజర్, సేల్స్‌మెన్, అసిస్టెంట్ సేల్స్‌మెన్ వంటి మొత్తం 29,986 మంది పనిచేస్తున్నారు. టాస్మాక్ దుకాణాలకు అనుసంధానంగా 2,919 ప్రాంతాల్లో బార్లు ఉన్నాయి. ఇందులో సుమారు 35 వేలమంది పని చేస్తున్నట్లు అంచనా. అంటే మద్య నిషేధంతో 65 వేలకు పైగా సిబ్బంది రోడ్డెక్కుతారు.

మద్యపానంలో మనది 16వ స్థానం...

దేశంలో 15 ఏళ్ల దాటిన పురుషులు 18.7 శాతం, మహిళలు 1.5 శాతం మద్యం సేవిస్తున్నట్లు పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. నగరాల్లో కన్నా గ్రామస్తులే అధికంగా మద్యం తాగేస్తున్నారు. మద్యపానం అధికంగా తాగే రాష్ట్రాల్లో తమిళనాడుది 16వ స్థానం. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా అరుణాచల ప్రదేశ్ (52.6 శాతం), తెలంగాణ (43.4 శాతం), సిక్కిం (39.9 శాతం) నిలిచాయి. తమిళనాడు 25.3 శాతంలో ఉంది. రాష్ట్రంలో ప్రతిరోజూ సరాసరిన 87.60 లక్షల మంది మద్యం తాగుతున్నట్లు అంచనా.

మద్యం బానిసల్ని కట్టడి చేయడం ఎలా?

మద్య నిషేధం అమలు చేస్తే ప్రస్తుతం టాస్మాక్ దుకాణాల్లో పని చేస్తున్న ఉద్యోగుల పరిస్థితి ఏమిటి? రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయ లోటును ఎలా పూడ్చుకుంటారు? ఇందుకు ప్రత్యామ్నాయం ఉందా? అనే ప్రశ్నలకు సమాధానం దొరకడం కష్టంగానే కనిపిస్తోంది. అంతేగాక మద్యానికి బానిసైన వ్యక్తి ఒక్కరోజులో మద్యం మానేయడం కష్టం. అదే జరిగితే అతనిపై దుష్ప్రభావాలు పడే అవకాశముందని, ఈ పరిస్థితి విపరీత పోకడలకు దారి తీస్తుందని మానసిక వైద్యులు హెచ్చరిస్తున్నారు. మరి వారందరినీ ప్రభుత్వం కట్టడి చేయడం సాధ్యమయ్యే పనేనా? మద్యం బానిసలకు విడతలవారీగా కొద్దికొద్దిగా డోస్ తగ్గిస్తూ మద్యం అందించేంత ప్రణాళిక, సిబ్బంది మన వద్ద ఉన్నారా? కట్టడి చేయడం ద్వారా ఏర్పడే దుష్ప్రభావాలను ప్రభుత్వం ఎదుర్కోగలదా? అనేది అనుమానమే.

మద్యం ద్వారా ఆదాయం కోట్ల రూపాయల్లో..



2003-04: రూ.3,639.93,
2004-05:రూ.4,872.03,
2005-06: రూ.6,030.77,
2006-07: రూ.7,473.61,
2007-08: రూ.8,821.16,
2008-09: రూ.10,601.50,
2009-10: రూ.12,498.22,
2010-11: రూ.14,965.42, 2011-12: రూ.18,081.16, 2012-13: రూ.21,680.67, 2013-14: రూ.21,674.95, 2014-15: రూ.24,164.95, 2015-16: రూ.25,845.58, 2016-17: రూ.26,995.25, 2017-18: రూ.26,797.96, 2018-19: రూ.31,157.83, 2019-20: రూ.33,133.24, 2020-21: రూ.33,811.15, 2021-22: రూ.36,050.65, 2022-23: రూ.44,121.13, 2023-24: రూ.52,733.00.

ఇంత ఆదాయం ప్రభుత్వం వదులుకుంటుందా?

రాష్ట్రంలో మద్యనిషేధం విధించాలని ప్రజలు నిర్ణయిస్తే స్వాగతిస్తామని టాస్మాక్ మద్యం దుకాణాల ఉద్యోగుల సంఘం ప్రకటించింది. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ నిర్ణయం తీసుకుంటుందని, అదే సమయంలో మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులకు భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలని ఆ సంఘం డిమాండ్ కోరింది. ఇంతకీ ఆదాయం సంగతెలా ఉన్నా, ప్రజల ఆరోగ్యమే తమకు ముఖ్యమని భావించి, మద్య నిషేధాన్ని అమలు చేయడానికి ధైర్యంగా ముందుకొచ్చే పార్టీ రాష్ట్రంలో ఉందా? అది ఇప్పట్లో సాధ్యమయ్యే పనేనా?.

మద్య నిర్మూలనా మహానాడుతో కలకలం...

2026లో రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్నాయి. అందుకు ఒకటిన్నర సంవత్సరం ముందు నుంచే పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. అధికార డీఎంకే కూటమిలో ఉన్న డీపీఐ మద్య నిర్మూలన మహానాడు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఆ మహానాడులో పాల్గొనాలంటూ ప్రతిపక్ష అన్నాడీఎంకే, కొత్తగా ఆవిర్భవించిన నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం వంటి పార్టీలను ఆహ్వానించింది. ఈ వ్యవహారం కొత్త పొత్తులకు దారి తీస్తుందేమో, ప్రస్తుత కూటములు చిన్నాభిన్నమవుతాయేమోనన్న చర్చ రాజకీయవర్గాల్లో కలకలం రేపుతోంది. అందుకే రాష్ట్రంలో విడతల వారీగా మద్యనిషేధం అమలు చేస్తామంటూ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి ముత్తుస్వామి తాజాగా సన్నాయినొక్కులు నొక్కుతున్నారు.

ప్రతి శాసనసభ నియోజకవర్గంలో
5 వేలమందికి సభ్యత్వం

- పార్టీ బలోపేతానికి కృషి
- ఎంఎన్ఎం ద్వితీయ సర్వసభ్య మండలి తీర్మానం
- మళ్లీ అధ్యక్షుడిగా కమల్ ఏకగ్రీవ ఎన్నిక



కమల్ అభివాదం

చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) బలోపేతానికి అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం ప్రతి శాసనసభ నియోజకవర్గంలో 5 వేలమందికి సభ్యత్వం కల్పించాలని నిర్ణయించింది. స్థానిక తేనాంపేటలోని కామరాజర్ అరంగంలో శనివారం ఉదయం పార్టీ ద్వితీయ సర్వ సభ్య మండలి సమావేశం అట్టహాసంగా జరిగింది. ఈ సమావేశంలో కమలహాసన్‌ను పార్టీ నిర్వాహకులంతా కలిసి మరోమారు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు, శాసనసభ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన విధివిధానాలు, వ్యూహ రచనలు, సభ్యత్వ ముమ్మర కార్యక్రమాలు చేపట్టడం గురించి సమగ్రంగా చర్చించారు.

16 తీర్మానాలు...

ఈ సమావేశంలో పార్టీని బలపరిచేదిశగా ప్రతి శాసనసభ నియోజకవర్గంలోనూ వచ్చే జూన్ 25లోగా కనీసం 5 వేలమందికి పార్టీ సభ్యత్వం కల్పించాలని, ఆ మేరకు సభ్యత్వ శిబిరాలు నిర్వహించాలని తీర్మానం చేశారు. అదే విధంగా ప్రతి పోలింగ్ కేంద్రానికి కనీసపక్షంగా ఐదుగురు పార్టీ ఇన్‌ఛార్జీలను నియమించాలని సభ్యులు మరొక తీర్మానం ప్రతిపాదించి ఆమోదించారు. మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న నేరాలు రోజురోజుకూ అధికమవుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ నేరాలకు కారణమైనవారిని కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం కొత్త చట్టాలు తీసుకురావాలని ఇంకో తీర్మానం చేశారు. మహిళలపై జరుగుతున్న హింసాత్మక చర్యలను అడ్డుకునేలా మేధావులు, సామాజిక సేవకులు, నిపుణులతో ఓ ఉన్నత స్థాయి కమిటీని పార్టీ ఏర్పాటు చేసి, ఆ కమిటీ విస్తృతంగా పరిశీలించి నివేదికను రూపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపాలని సమావేశం తీర్మానించింది. మాదకద్రవ్యాల వాడకాన్ని నిరోధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని పేర్కొంటూ మరొక తీర్మానం చేసింది. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వమే కులాలవారీ జనగణనను చేపట్టాలని, రాష్ట్రానికి అవసరమైనంత నిధులను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ మరికొన్ని తీర్మానాలు చేసింది. తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళం జరుపుతున్న దాడులను, శ్రీలంక ప్రభుత్వం జాలర్లకు భారీ స్థాయిలో జరిమానా విధించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ పార్టీ మరో తీర్మానం ప్రతిపాదించి ఆమోదించింది. ఇకపై తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళం ఎలాంటి దాడులు జరపకుండా, అక్రమ నిర్బంధాలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆ తీర్మానంలో కోరింది. జనాభా ప్రాతిపదికగా లోక్‌సభ స్థానాలను పునర్విభజన చేయకూడదని కేంద్రాన్ని కోరుతూ మరొక తీర్మానం చేసింది. దేశంలో నిరంకుశత్వానికి ఊతమిచ్చేలా కేంద్రం జమిలి ఎన్నికల ప్రతిపాదనను తెరపైకి తీసుకురావడాన్ని మక్కల్ నీది మయ్యం తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం చేసింది. ఎన్నికల్లో పోటీ చేసే వయసును 25 యేళ్ల నుండి 21కి తగ్గించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరుతూ పార్టీ ఓ తీర్మానం ప్రతిపాదించి ఆమోదించింది. అవయవాల దానంలో రాష్ట్రంలో ముందంజలో ఉండటం పట్ల హర్షం ప్రకటిస్తూ మరో తీర్మానం చేసింది. కమల్ సూచన మేరకు మక్కల్ నీదిమయ్యం, మోహన్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన అవయవ దాన శిబిరంలో 1081 మంది అవయవాల దానం కోసం పేర్లను నమోదు చేసుకోవడం పట్ల కూడా పార్టీ హర్షం ప్రకటిస్తూ తీర్మానం చేసింది. ఈ సమావేశంలో మొత్తం 16 తీర్మానాలు ప్రతిపాదించి ఆమోదించినట్లు కమల్ ప్రకటించారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎ. అరుణాచలం, డిప్యూటీ అధ్యక్షులు ఏజీ మౌర్యా, ఆర్ తంగవేల్, ప్రధాన కార్యాలయ కార్యదర్శి సెంథిల్ ఆరుముగం, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల విభాగం సమన్వయకర్త మయిల్‌వాహనం తనిగైవేలు, విల్లుపురం జోన్ కార్యదర్శి ఆర్పీ శ్రీపతి, జాలర్ల సంఘం కార్యదర్శి ఆర్ ప్రదీప్‌కుమార్, ప్రచార ప్రతినిధి మురళీ అబ్బాస్, సర్వసభ్యమండలికి చెందిన సుమారు 1000 మంది పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నేతలు

పంచామృతంలో ఆవిన్ నెయ్యినే వినియోగిస్తున్నాం

- దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు



యాత్రను ప్రారంభిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

ఐసిఎఫ్, సెప్టెంబరు 21: పళని ఆలయ పంచామృతంలో ఆవిన్ నెయ్యి మాత్రమే వినియోగిస్తున్నామని రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు స్పష్టం చేశారు. శనివారం చెన్నై ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయంలో వృద్ధుల పురటాసి మాసం వైష్ణవాలయాల ఆధ్యాత్మిక యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హిందూ దేవాదాయ శాఖ వివిధ ఆధ్యాత్మిక యాత్రలు నిర్వహిస్తోందని తెలిపారు. ఇదివరకే 500 మంది వృద్ధులను ఉచితంగా కాశీ-రామేశ్వరం యాత్రకు తీసుకువెళ్లామన్నారు. ఈ ఏడాది 420 మంది భక్తులను తీసుకుని వెళ్లనున్నామని పేర్కొన్నారు. అలాగే షట్ దివ్యక్షేత్రాలైన సుబ్రమణ్యస్వామి ఆలయాల సందర్శనకు నాలుగు విడతల్లో 813 మందిని తీసుకుని వెళ్తామని, ఐదో యాత్ర అక్టోబరు 6న తిరుత్తణిలో బయలుదేరుతుందన్నారు. పురటాసి మాసంలో వైష్ణవాలయాలకు వెయ్యిమంది వృద్ధులను తీసుకుని వెళ్లే ఆధ్యాత్మిక యాత్ర 7 మండలాల్లో నాలుగు విడతలుగా సాగనుండగా, తొలి విడత యాత్ర 270 మంది భక్తులతో శనివారం ప్రారంభించామన్నారు. ఆలయాలకు అవసరమయ్యే నెయ్యి ఆవిన్ సంస్థ నుంచే కొనుగోలు చేస్తున్నామని, పళని పంచామృతానికి సంబంధించి బీజేపీ శ్రేణులు చేసే విష ప్రచారం వాస్తవం కాదన్నారు. పంచామృతం తయారీలో ఆవిన్ నెయ్యి మాత్రమే వినియోగిస్తున్నామన్నారు. ఒకవేళ అక్కడ తగినంత నెయ్యి లభ్యం కానిపక్షంలో నిబంధనల మేరకు ప్రైవేటు సంస్థల నుంచి కొనుగోలు చేస్తామన్నారు. పళని పంచామృతంపై ఇప్పటి వరకూ ఎలాంటి ఫిర్యాదులు అందలేదని మంత్రి వివరించారు.

మోర్సింగ్ వాద్య కళాకారుడు శ్రీరంగం కన్నన్ కన్నుమూత



చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ మోర్సింగ్ వాద్య కళాకారుడు శ్రీరంగం కన్నన్ కన్నుమూశారు. ఆయన వయస్సు 72. సంవత్సరాలు. కర్ణాటక సంగీత కచేరీలలో పక్కవాద్యమైన మోర్సింగ్‌ను వాయించడంలో ప్రసిద్ధి చెందిన కన్నన్ 1952 మే 5న శ్రీరంగంలో జన్మించారు. ప్రముఖ విద్వాంసుడు పుదుకోట మహాదేవన్ వద్ద తన 19 యేటనే మోర్సింగ్ వాయించటం నేర్చుకున్నారు. మోర్సింగ్, మృదంగ విద్వాంసులు కానాడుకాత్తాన్ రాజారామన్, మృదంగ దిగ్గజం కారైక్కుడి మణి తదితరుల వద్ద లయ నైపుణ్యాలను, తాళ సమ్మేళన విధానాలను అభ్యసించారు. గణితంలో పట్టభద్రుడైన శ్రీరంగం కన్నన్ బ్యాంక్ ఉద్యోగిగాను పనిచేశారు. తనియావర్తనాలలో అక్షరం పొల్లుపోని రీతిలో మోర్సింగ్‌ను వాయించేవారు. కర్ణాటక సంగీత దిగ్గజాలు మంగళంపల్లి బాలమురళీకృష్ణ, మాండలిన్ శ్రీనివాస్, వేణువిద్వాంసులు రమణి కచేరీల్లో కన్నన్ వాద్యసహకారం అందించేవారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయనను కలైమామణి అవార్డుతో సత్కరించింది. మ్యూజిక్ అకాడమీ నుంచి డాక్టర్ రామ్మూర్తి అవార్డు (2సార్లు), శ్రీరాగం ఫైన్ ఆర్ట్స్ 'మన్నార్గుడి నటేశపిళ్లై అవార్డు, నారదగాన సభ, త్యాగబ్రహ్మం గాన సభనుండి కూడా అవార్డులు పొందారు. వృద్ధాప్య సమస్యల కారణంగా ఆయన కన్నుమూశారు. శ్రీరంగం కన్నన్ మృతి పట్ల చెన్నైకి చెందిన కర్ణాటక సంగీత కళాకారులంతా సంతాపం ప్రకటించారు.

వైభవంగా పురటాసి తొలి శనివారం వేడుకలు

వైష్ణవాలయాలకు పోటెత్తిన భక్తజనం ● టీటీడీ శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పురటాసి తొలి శనివారం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వైష్ణవాలయాలకు భక్తులు పోటెత్తారు. వేంకటేశ్వరస్వామివారికి అత్యంత ప్రీతికరమైన పురటాసి శనివారం నాడు తమిళ భక్తులు ప్రత్యేక వ్రతమాచరించటం ఆనవాయితీ. ఆ మేరకు వైష్ణవాలయాల్లో పసుపు దుస్తులు, నుదుట తిరునామాలు ధరించిన భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. పురటాసి శనివారంనాడు శ్రీవారిని దర్శిస్తే కష్టాలన్నీ తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ నేపథ్యంలో శనివారం ఉదయమే పెరుమాళ్ ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. కలియుగ భూలోక వైకుంఠంగా పేరుగడించిన శ్రీరంగం రంగనాథస్వామివారి ఆలయంలో వేకువజాము నుంచే భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. రంగనాథస్వామివారి సన్నిధి, అమ్మవారి సన్నిధి, చక్రతాళ్వార్ల సన్నిధిని దర్శనం చేసుకున్నారు. ఇదే విధంగా శ్రీరంగం కాట్టళగియ సింగర్ ఆలయం కూడా కిటకిటలాడింది. లాల్గుడి సమీపంలోని అన్బిల్ సుందరరాజపెరుమాళ్ ఆలయంలో వడివళగియ నంబి శ్రీదేవి, భూదేవి సమేతుడై ప్రత్యేక అలంకరణతో కొలువుదీరి భక్తులను అనుగ్రహించారు. తురైయూరు పెరుమాళ్‌మలైలోని వెంకటాచలపతి ఆలయం, తంజావూరు నాలుకాల్ మండపం ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, కరూరు తాన్‌తోంద్రి మలైలోని కల్యాణ వెంకటేశ్వరాలయంలో స్వామివారు సర్వాలంకరణతో తన ఇష్టదేవేరులతో భక్తులకు కనువిందు చేశారు.

చెన్నైలో...: ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయం, మైలాపూరు మాధవ పెరుమాళ్ ఆలయం, టి.నగర్‌లోని టీటీడీ శ్రీవారి ఆలయం సహా వైష్ణవాలయాలన్నింటినీ అందంగా అలంకరించారు. పార్థసారథి ఆలయంలో పురటాసి తొలి శనివారం సందర్భంగా వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ భక్తులకు సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం అంటూ ఆలయ నిర్వాహకులు రెండు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఉదయం 6గంటలకు ప్రారంభమైన దర్శనం మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల దాకా కొనసాగింది. సర్వదర్శనం క్యూలైన్లలో వెళ్లిన భక్తులు స్వామివారిని దర్శించేందుకు సుమారు గంటకు పైగా వేచి ఉండాల్సి వచ్చింది. టి.నగర్ వెంకటనారాయణరోడ్డులోని టీటీడీ శ్రీవారి ఆలయంలో పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామిని పురటాసి తొలి శనివారం సందర్భంగా వివిధ రకాల పూలమాలలతో అందంగా అలంకరించారు. ఉదయం ఆరు గంటల నుండే భక్తులు శ్రీవారిని దర్శించేందుకు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా ఆలయ నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేపట్టారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది.




పద్మావతి దేవి ఆలయంలో భక్తుల రద్దీ - టీటీడీ ఆలయంలో శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

సమాచార దృష్టి

24 నుంచి సైన్స్ ఎగ్జిబిషన్

ఐసిఎఫ్, సెప్టెంబరు 21: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో చెన్నైలో సైన్స్ ఎగ్జిబిషన్ ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు జరుగనుంది. ఈ ప్రదర్శనను 24వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటలకు ఉన్నత విద్యాశాఖ మంత్రి కె.పొన్ముడి ప్రారంభించనున్నారు. పెరియార్ సైన్స్, టెక్నాలజీ కేంద్ర (బిర్లా ప్లానిటోరియం) ప్రాంగణంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శకులు ఎగ్జిబిషన్ తిలకించవచ్చు.

30 లోపు పన్ను చెల్లించాలి

ఐసిఎఫ్, సెప్టెంబరు 21: తాగునీరు, మురుగునీటి పన్నులు ఈనెల 30వ తేదీ లోపు చెల్లించాలని చెన్నై మెట్రో వాటర్ బోర్డు తెలిపింది. పన్ను చెల్లించేందుకు అన్ని ప్రాంతీయ కార్యాలయాలు, ప్రధాన కార్యాలయం అన్ని పనిదినాలు, శనివారాల్లో పని చేయనున్నాయి. పన్నులను డీడీ, చెక్కు, నగదు రూపంలో చెల్లించవచ్చు. అలానే వాటర్‌బోర్డు వెబ్‌సైట్ ద్వారా కూడా చెల్లించవచ్చు.

అప్రెంటీస్‌షిప్‌కు దరఖాస్తులాహ్వానం

ఐసిఎఫ్, సెప్టెంబరు 21: అప్రెంటీస్‌షిప్‌కు ఐటీఐ చదివినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. చెన్నై మెట్రో పాలిటన్ రవాణా సంస్థలో రూ.14 వేల ఉపకార వేతనంతో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక క్రోంపేటలోని ఎంటీసీ వృత్తి శిక్షణ పాఠశాలలో అభ్యర్థుల ఎంపిక జరగనుంది. ఐటీఐలో మెకానిక్, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, పెయింటర్, వెల్డర్ విభాగాల్లో ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

నేడు చెన్నై బీచ్ - తాంబరం రైళ్లు రద్దు

ఐసిఎఫ్, సెప్టెంబరు 21: స్థానిక తాంబరం రైల్వే యార్డులో చేపట్టనున్న పర్యవేక్షణ పనుల కారణంగా చెన్నై బీచ్ - తాంబరం సబర్బన్ రైళ్ల సేవలు ఆదివారం రద్దు చేస్తున్నట్లు దక్షిణరైల్వే ప్రకటించింది. ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై బీచ్ - పల్లావరం మధ్య ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

3 రోజులు తాగునీటి సరఫరా నిలిపివేత

ఐసిఎఫ్, సెప్టెంబరు 21: నగరంలోని తేనాంపేట, అడయార్ మండలాల్లో మూడు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు చెన్నై మెట్రోవాటర్ బోర్డు ప్రకటించింది. మందవెల్లి రామకృష్ణ మఠం రోడ్డులో చేపట్టనున్న ప్రధాన పైప్‌లైన్ అనుసంధాన పనుల కారణంగా ఈ నెల 24వ తేదీ ఉదయం 9నుంచి 26వ తేదీ ఉదయం 9 గంటల వరకు ట్రిప్లికేన్, రాయపేట, మైలాపూర్, నందనం, అభిరామపురం, మందవెల్లి, రాజా అన్నామలైపురం ప్రాంతాల్లో తాగునీటి సరఫరా ఉండదు. ఈ ప్రాంతాలకు ట్యాంకర్ లారీల ద్వారా నీటిని సరఫరా చేయనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో నెం.044-45674567లో సంప్రదించాలని మెట్రోవాటర్ బోర్డు పేర్కొంది.

30 నుంచి నగరంలో రోడ్లు తవ్వేందుకు అనుమతి నిరాకరణ

ఐసిఎఫ్, సెప్టెంబరు 21: ఈశాన్య రుతుపవనాలు ప్రారంభం కానుండడంతో నగరంలో ఈ నెల 30వ తేదీ నుంచి రోడ్లపై కొత్తగా గుంతలు తవ్వేందుకు అనుమతి లేదని కార్పొరేషన్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ ప్రాంతాల్లో గత మూడు నెలలుగా మెట్రోరైలు పథకం, మెట్రోవాటర్ బోర్డు, విద్యుత్ బోర్డు రోడ్లపై గుంతలు తవ్వి పనులు చేస్తున్నాయి. ఈ గుంతల వల్ల వాహన చోదకులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈశాన్య రుతపవన వర్షాలు ప్రారంభం కానుండడంతో కొత్తగా గుంతలు తవ్వరాదని కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

రేపు ఏచూరి సంస్మరణ సభ

పెరంబూర్, సెప్టెంబరు 21: దివంగత సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ సోమవారం సాయంత్రం 5 గంటలకు జరగనుంది. స్థానిక కామరాజర్ ఆడిటోరియంలో జరగనున్న ఈ కార్యక్రమానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ అధ్యక్షత వహించనుండగా, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పాల్గొని ఏచూరి చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో ద్రావిడర్ కళగం అధ్యక్షుడు వీరమణి, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, సీనియర్ పాత్రికేయుడు ఎన్.రామ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్, డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్, సీపీఎం (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ఆశైతంబి, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అధ్యక్షుడు ఖాజామొహిద్దీన్, మనిదనేయ మక్కల్ కట్చి అధ్యక్షుడు జవాహిరుల్లా, తమిళగ వాల్వురిమై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వేల్‌మురుగన్, కొంగునాడు మక్కల్ కట్చి అధ్యక్షుడు ఈశ్వరన్ తదితరులు పాల్గొననున్నారని ఆ పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది.

545 పురస్కారాలు పొందిన ఆరోగ్యశాఖ

పెరంబూర్, సెప్టెంబరు 21: రాష్ట్ర ఆరోగ్యశాఖ మూడేళ్లలో 545 పురస్కారాలు కైవసం చేసుకుందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. కొండ గ్రామాల ప్రజలు వైద్యచికిత్సలు, మక్కల్ తేడి మరుత్తువం, కిడ్నీ సంరక్షణ తదితర పథకాల ద్వారా 56,07,385 మంది లబ్ధిపొందారు. ముఖ్యమంత్రి సమగ్ర వైద్య బీమా పథకాన్ని ప్రస్తుతం 1,834 ఆసుపత్రులకు విస్తరించినట్లు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

నేడు నారాయణ విద్యాసంస్థ ఆధ్వర్యంలో 'తిరుక్కురల్' కంఠస్థ సాధన

పెరంబూర్, సెప్టెంబరు 21: నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం 'తిరుక్కురల్' కంఠస్థ సాధన చేపట్టనున్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు 12 గంటల పాటు చెన్నైలోని 19 బ్రాంచీలు, మదురై బ్రాంచ్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. 'నారాయణ వరల్డ్ రికార్డ్స్ ఫెస్టివల్ 2024' పేరిట నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో 1 నుంచి 5వ తరగతి వరకు సుమారు 8,100 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. ఒక్కో విద్యార్థి నాలుగు గంటల సేపు 50 పదాలు వల్లించనున్నారు. ఈ కార్యక్రమం ముగింపు వేడుకలు ఈ నెల 28, 29 తేదీల్లో అన్నా సెంటినరీ లైబ్రరీ ఆడిటోరియంలో నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్ పొంగూరు శరణి, స్కూల్ అకడమిక్ హెడ్ కె.లక్ష్మి శకుంతల నేతృత్వంలో జరుగనున్నాయని ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

సంకల్ప్ 'లెర్న్ -2024' సదస్సు ప్రారంభం

చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాడీ వ్యవస్థ వైవిధ్యాలతో చదవటానికి, రాయటానికి కష్టపడే చిన్నారుల కోసం ఏర్పాటైన సంకల్ప్ ట్రస్టు లెర్న్ -2024 పేరుతో రెండురోజుల అంతర్జాతీయ సదస్సును నగరంలో ఏర్పాటు చేసింది. ఈ సదస్సును కేంద్ర జాతీయ భద్రతా విభాగం మాజీ సలహాదారుడు ఎంకే నారాయణన్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ట్రస్టు వ్యవస్థాపకురాలు డాక్టర్ సులతా అజిత్, లక్ష్మీకృష్ణకుమార్, డాక్టర్ హిమాంగ్సు దాస్, ప్రొఫెసర్ రోస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అపార్టుమెంట్ నిర్మాణానికి రూ.27 కోట్ల లంచం!

అన్నాడీఎంకే మాజీ మంత్రిపై కేసు ● ఆయన ఇద్దరు కుమారులపైనా ● తంజావూరు జిల్లా ఏసీబీ అధికారుల చర్య

అడయార్, సెప్టెంబరు 21: గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో బహుళ అంతస్తు భవన నిర్మాణం కోసం రూ.27 కోట్ల లంచం తీసుకున్నట్టు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో మాజీ మంత్రి వైద్యలింగంపై తంజావూరు జిల్లా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు కేసు నమోదు చేశారు. ఇదే ఆరోపణలపై వైద్యలింగం ఇద్దరు కుమారుల సహా మొత్తం 11 మందిపై కూడా కేసు నమోదైంది. ఈ కేసు పూర్వాపరాలను పరిశీలిస్తే.. గత 2011-2016 మధ్యకాలంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత సారథ్యంలోని అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రిగా వైద్యలింగం ఉన్నారు. జయ హయాంలో ఓ వెలుగు వెలిగిన వైద్యలింగం.. ఒరత్తనాడు శాసనసభ్యుడిగా ఉన్నారు. జయ మృతి తర్వాత ఆయన మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం వర్గంలో చేరారు. ఈయన సొంతూరు తంజావూరు జిల్లా ఒరత్తనాడు తాలూకా తెలుకన్‌కుట్టికాడు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన వైద్యలింగానికి వ్యవసాయంలో మాత్రమే ఆదాయం వచ్చేది. ఈయనకు ముగ్గురు కుమారులు, కుమార్తె. ఒరత్తనాడు శాసనసభ సభ్యుడిగా వరుసగా మూడుసార్లు ఎన్నికయ్యారు. 2001-06 మధ్యకాలంలో రాష్ట్ర పరిశ్రమలు, అటవీ శాఖ మంత్రిగా ఉన్నారు. 2011-16 మధ్య రాష్ట్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా కొనసాగారు. అదనంగా వ్యవసాయ మంత్రిత్వ శాఖ బాధ్యతలను కూడా నిర్వహించారు. 2016లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఓటమిని చవిచూశారు. దీంతో ఆయన్ని రాజ్యసభకు పంపించారు. 2021లో జరిగిన ఎన్నికల్లో ఆయన మళ్లీ ఒరత్తనాడు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

కుమారులు వ్యాపారం..

మాజీ మంత్రి వైద్యలింగం పెద్ద కుమారుడు ప్రభు. తన నానమ్మ ముత్తమ్మాళ్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని 2014లో చెన్నైలో ప్రారంభించారు. చెన్నై, తిరుచ్చి తదితర ప్రాంతంల్లో ఇళ్ళ స్థలాలను భారీగా కొనుగోలు చేశారు. రియల్ ఎస్టేట్ కంపెనీ పేరిట ఈక్కాట్టుతాంగల్ ఇండియన్ బ్యాంకు శాఖలో రూ.27.90 కోట్ల మేరకు నిల్వవుంచారు. ఈ నేపథ్యంలో 2014 సెప్టెంబరు 22వ తేదీన ముత్తమ్మాళ్ రియల్ ఎస్టేట్‌లో 90 శాతం షేర్లను ప్రభుకు, మిగిలిన పది శాతం షేర్లను తమ బంధువు పన్నీర్‌కు రాసుకున్నారు. అంతేకాకుండా, 2015, మార్చి 24వ తేదీన ఈ కంపెనీకి చెందిన ఈక్కాట్టుతాంగ్ ఇండియన్ బ్యాంకు ఖాతాలో రూ.10.82 కోట్ల మేరకు నిధులు ఉన్నట్టు గుర్తించారు. ఈ కంపెనీ కేవలం రూ.36 లక్షల షేర్ మూలాధనంలో స్థాపించడం జరిగింది. అంతేకాకుండా ఆదాయపన్ను శాఖకు సమర్పించిన ఐటీ రిటర్న్‌లో ఈ కంపెనీకి ఇతర ఆదాయ మార్గాలు ఏవీ లేవు.

బ్యాంకు ఖాతాలోకి రూ.27 కోట్లు

ఈ నేపథ్యంలో ఓ రియల్ ఎస్టేట్ సంస్థ స్థానిక పెరుంగళత్తూరులోని జీఎస్టీ రోడ్డుకు సమీపంలో 57.94 ఎకరాల్లో 1453 హౌసింగ్ గృహాల నిర్మాణం కోసం అనుమతులు కోరుతూ 2013 డిసెంబరు 2న సీఎండీఏకు దరఖాస్తు చేసుకుంది. అప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ ఫైలుకు 2016 ఫిబ్రవరి 24వ తేదీన ఆమోద ముద్రపడింది. అదే సమయంలో నాడు గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న వైద్యలింగంకు రూ.27.90 కోట్ల మేరకు లంచం ఇచ్చినట్టు ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితుల్లో ముత్తమ్మాళ్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఇండియన్ బ్యాంకు ఖాతాకు ఆర్టీజీఎస్ ద్వారా రూ.27.90 కోట్లు జమ అయ్యాయి. ఈ నిధులను ఓ కోల్‌మైన్స్ కంపెనీ నుంచి పొందినట్టుగా ముత్తమ్మాళ్ రియల్ ఎస్టేట్ కంపెనీ పేర్కొంది. ఆ తర్వాత వైద్యలింగం తన భార్య, కుమారులపై భారీగా స్థిరాస్తులను కొనుగోలు చేశారు. అలాగే, ఆదాయానికి మించి 1057 శాతం ఆస్తులు సేకరించినట్టు వెలుగులోకి వచ్చింది. దీనిపై తంజావూరు ఏసీబీ ఇన్‌స్పెక్టర్ శరవణన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైద్యలింగం, ఆయన కుమారుల సహా మొత్తం 11 మందిపై కేసు నమోదు చేశారు. కాగా, మూడు రోజుల క్రితం అన్నాడీఎంకే మాజీ మంత్రి ఎస్పీ వేలుమణిపై కూడా ఇదే తరహా కేసు నమోదైంది.



వైద్యలింగం

కో-ఆప్‌టెక్స్ దీపావళి విక్రయాలు ప్రారంభం



వేలూరు, సెప్టెంబరు 21: దీపావళి పండుగను పురస్కరించుకుని తమిళనాడు చేనేత కార్మికుల కోఆపరేటివ్ సంఘం ఆధ్వర్యంలో వేలూరులో ఏర్పాటు చేసిన ప్రత్యేక విక్రయాలను వేలూరు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి సోమవారం ప్రారంభించారు. గత ఏడాది సుమారు రూ.1.82 కోట్ల విక్రయాలు జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది రూ.2.70 కోట్ల విక్రయాలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ విక్రయాల ప్రారంభోత్సవంలో వేలూరు ఎమ్మెల్యే ఎంఏ కార్తికేయన్, కార్పొరేషన్ మేయర్ సుజాత ఆనందకుమార్, చేనేత విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యభామ తదితరులు కూడా పాల్గొన్నారు.

గుహైనల్లూరు వద్ద చెక్ డ్యాం ప్రారంభం



వేలూరు, సెప్టెంబరు 21: వేలూరు జిల్లా కాట్పాడి సమీపంలోని గుహైనల్లూరు వద్ద పొన్నై నదిపై రూ.12.70 కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాంను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్ శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ చెక్‌డ్యాం వలన పొన్నై చెరువుకు రెండువైపులా 2 కి.మీ మేర వున్న గుహైనల్లూరు, తక్కాయపాళ్యం, మరుదమ్ పాళ్యం, శ్రీపాదనల్లూరు, రామకృష్ణాపురం తదితర గ్రామాలకు చెందిన 716 ఎకరాలకు సాగునీరందుతుందన్నారు.

వర్షాకాల పరిస్థితులపై సమీక్ష



సమావేశంలో కలెక్టర్ తదితరులు

వేలూరు, సెప్టెంబరు 21: ఈశాన్య రుతుపవనాల వర్షాలను ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలపై శనివారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి, ఉద్యానవన, విద్యుత్, ప్రజా పనుల శాఖాధికారులు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భారీ వర్షాల వల్ల ఏర్పడే వరద పరిస్థితిని ఎదుర్కోవడం, బాధితులను ఆదుకోవడం, ఆహార ఏర్పాట్లు తదితరాలపై చర్చించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు.

ఉత్సాహంగా మొక్కలు నాటే కార్యక్రమం



స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న అధికారులు

పెరంబూర్, సెప్టెంబరు 21: దక్షిణ రైల్వే ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. 'స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా దక్షిణ రైల్వే శాఖ పలు కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగా శనివారం పలు స్టేషన్లు, రైల్వే కాలనీ, డిపోలు, కార్ షెడ్లలో సుమారు 2,300 మొక్కలు నాటారు. చెన్నై సెంట్రల్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ అలోక్‌కుమార్ మౌర్య, అడిషనల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ పుణ్యకోటి తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. దక్షిణ రైల్వే పరిధిలో చేపట్టిన ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, స్కౌట్ అండ్ గైడ్స్, ఎన్జీఓలు ప్రతినిధులు అని మొత్తం 800 మంది పాల్గొన్నారు.

జాలర్లకు గుండ్లు గీయించడం కంటే తిరుపతి లడ్డూ వివాదం పెద్దదా?

● ● ఎన్‌టీకే కన్వీనర్ సీమాన్ ప్రశ్న
● ఆయన తక్షణం క్షమాపణ చెప్పాలి
● పొంగులేటి డిమాండ్

అడయార్, సెప్టెంబరు 21: తమిళ జాలర్లకు శ్రీలంక గుండు గీయించి స్వదేశానికి పంపించిదనీ, ఈ సమస్య కంటే తిరుపతి లడ్డూలో కొవ్వు ఉన్న విషయం పెద్దదిగా కనిపిస్తుందా? అని నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్ ప్రశ్నించారు. శివగంగైలోని శివన్ ఆలయ సమీపంలో జరిగిన సభలో సీమాన్ మాట్లాడుతూ... వన్ నేషన్ - వన్ ఎలక్షన్ పేరుతో దేశంలో ఒకే దఫాలో ఎన్నికలు నిర్వహించలేరన్నారు. బిహార్, వెస్ట్ బెంగాల్ వంటి రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను ఏడు దశల్లో నిర్వహించారన్నారు. మరి దేశ వ్యాప్తంగా ఒకే దశలో ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. ఇపుడు సరికొత్త వివాదం తెరపైకి వచ్చిందన్నారు. తిరుపతి లడ్డూల తయారీలో జంతువుల కొవ్వును కలిపి తయారు చేసినట్టుగా చెబుతున్నారని, తన వరకు కొవ్వు కలిపినా.. కలపకపోయినా తింటానన్నారు. ఆ లడ్డూ తిని ఇప్పటివరకు ఎవరూ చనిపోలేదు కదా అని ప్రశ్నించారు. అయితే ఈ వ్యాఖ్యలను బీజేపీ జాతీయ ఇన్‌చార్జ్ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ వ్యాఖ్యలు ఆయన మానసిక పరిస్థితికి అద్దం పడుతున్నాయన్నారు. కోట్లాదిమంది భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశంపై సీమాన్ ఇష్టానుసారంగా మాట్లాడటం సబబు కాదన్నారు.

నాలుగు జిల్లాల కలెక్టర్లతో సీఎస్ ప్రత్యేక భేటీ

● రోడ్ల తవ్వకంపై ఆంక్షలు

అడయార్, సెప్టెంబరు 21: వర్షాకాలం ప్రారంభంకానున్న దృష్ట్యా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం నేతృత్వంలో చెన్నై, కాంచీపురం. చెంగల్పట్టు, తిరువళ్లూరు జిల్లాల కలెక్టర్లతో కీలక సమావేశం జరిగింది. వివిధ రకాల నిర్మాణ పనుల కోసం రోడ్లను తవ్వకుండా ఆంక్షలు విధించారు. అలాగే, గత యేడాది వర్షాకాలం ఆరంభానికి ముందు తీసుకున్న ముందస్తు చర్యల తరహాలోనే జోన్ల వారీగా అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే, ఆయా ప్రాంతాల్లో హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులను కలుపుకుని ముందుకుసాగాలని కోరారు. చెన్నైలో జరుగుతున్న వివిధ రకాలైన నిర్మాణ పనులను ఈ నెలాఖరు లేదా అక్టోబరు 10వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అత్యవసర పనుల కోసం తవ్వినట్టయితే, ఆ గుంతలను తక్షణం పూడ్చి వేయాలని సూచించారు. రెవెన్యూ శాఖ, మత్స్యశాఖ, పోలీస్ శాఖలను సమన్వయం చేసుకోవాలన్నారు.

పొన్నేరి వద్ద రైళ్ల కూల్చివేతకు కుట్ర

● లెవెల్ క్రాసింగ్ వద్ద బోల్టుల తొలగింపు



పులికుళం వద్ద లెవల్ క్రాసింగ్‌ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసు అధికారి

చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పొన్నేరి రైల్వేస్టేషన్ సమీపం పులికుళం వద్ద రైలు పట్టాల లెవల్ క్రాసింగ్ బాక్స్ బోల్టులను గుర్తు తెలియని దుండగులు తొలగించారు. ఆ మార్గంలో వెళ్లే రైళ్లను కూల్చివేసేందుకు కుట్రపన్నారు. సకాలంలో రైల్వే సిబ్బంది గుర్తించి మరమ్మతులు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. శనివారం వేకువజాము 3.30 గంటల ప్రాంతంలో పొన్నేరి - పులికుళం మధ్య లెవల్ క్రాసింగ్ బాక్స్ పని చేయకపోవడంతో అక్కడి రైలు పట్టాల మార్పిడి కార్మికుడు వెంటనే స్టేషన్ మాస్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే రైల్వే సాంకేతిక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని పరిశీలించారు. లెవల్ క్రాసింగ్ బాక్స్ బోల్టులు తొలగించి ఉండడాన్ని గమనించి చెన్నై -గుమ్మిడిపూండి మార్గంలో వెళ్లే రైళ్లను నిలిపివేశారు. రైల్వే సాంకేతిక సిబ్బంది లెవల్ క్రాసింగ్ జంక్షన్ బాక్స్‌ను మరమ్మతులు చేసిన తరువాత రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఈనెల 17న కూడా ఇదే విధంగా ఆ ప్రాంతంలో పట్టాలు, స్తంభాలను కలుపుతూ బిగించి ఉన్న 95 కొక్కీలు తొలగించి ఉండటాన్ని రాత్రిపూట పట్టాల రిపేరీ వాహన సిబ్బంది గమనించి మరమ్మతులు చేపట్టారు.

చదువుతో పాటు కళలను ప్రోత్సహించాలి

ప్రొఫెసర్ కామకోటి ● ఐఐటీఎంలో జాతీయ రంగోలీ వర్క్‌షాపు



వర్క్‌షాపు ప్రారంభిస్తున్న గుమ్మడి రామలక్ష్మి - కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు

అడయార్, సెప్టెంబరు 21: ఐఐటీ మద్రాస్, సంస్కార భారతి సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ రంగోలీ వర్క్‌షాపు శుక్రవారం కమ్యూనిటీ హాలులో ప్రారంభమైంది. ముందుగా సంస్కార భారతి రంగోలి సంస్థ సభ్యులు ప్రార్థనా గీతాన్ని ఆలపించారు. ఆ తర్వాత ఐఐటీఎం తరపున కార్యనిర్వాహకులు డాక్టర్ గుమ్మడి రామలక్ష్మి, శరణ్య అరుల్, కార్యదర్శి రుద్ర, అఖిల భారత భూ అలంకరణ ప్రముఖుడు రఘురాజ్ దేశ్‌పాండే, క్షేత్ర ప్రముఖుడు రవీంద్రన్, సంస్కార భారతి (తమిళనాడు) అధ్యక్షురాలు దాక్షాయణి రామచంద్రన్, భూ అలంకరణ ప్రముఖురాలు ప్రేమలత జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆ తర్వాత సంస్కార భారతి మాజీ అధ్యక్షుడు మాధవన్‌ను శాలువాతో రఘురాజ్ దేశ్‌పాండే సత్కరించారు. ఈ సందర్భంగా రఘురాజ్ మాట్లాడుతూ... దేశంలోని వివిధ ప్రాంతాల్లో ముగ్గుల వర్క్‌షాపులను నిర్వహించామన్నారు. అయితే, ఐఐటీఎంలో ఈ తరహా వర్క్‌షాపును నిర్వహించడం చాలా ఆహ్లాదకరంగా ఉందన్నారు. స్త్రీపురుషులకు వస్త్ర, ఆభరణాలు ఎలా ఆనందాన్ని కలిగిస్తాయో, ఈ భూమికి కూడా ముగ్గులతో సౌందర్యం కలుగుతుందన్నారు. ఈ వర్క్‌షాపులో భారతదేశంలో ఆయా రాష్ట్రాల నుంచి 180 మంది పాల్గొంటున్నారని తెలిపారు. ఈ వర్క్‌షాపు ఆదివారం కూడా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐఐటీఎం డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి మాట్లాడుతూ... కళలు ముఖ్యమని, విద్యార్థుల్లో ఒత్తిడిని సంఘర్షణను తగ్గిస్తాయన్నారు. చదువుతో పాటు కళలను కూడా ప్రోత్సహించాలన్నారు. ముగ్గుల సంస్కృతి కూడా కళల్లో ఒక భాగమన్నారు. రంగవల్లికల్లో మహా పెరియవా చిత్రం సందర్శకులను అమితంగా ఆకట్టుకుంది.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థుల మానవహారం

అడయార్, సెప్టెంబరు 21: మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా విద్యార్థులు మానవహారం నిర్వహించారు. స్థానిక కొళత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కపాలేశ్వర ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీకి చెందిన విద్యార్థినీ విద్యార్థులు 100 మీటర్ల మేరకు మానవహారం నిర్వహించి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ లలిత, కొళత్తూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ వివేకానందన్, విల్లివాక్కం ట్రాఫిక్ పోలీస్ విభాగం ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరితో విద్యార్థులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొడైకెనాల్‌లో భూమిలో పగుళ్లు



పగుళ్లు ఏర్పడిన దృశ్యం

పెరంబూర్, సెప్టెంబరు 21: కొడైకెనాల్‌లో 300 అడుగుల మేర భూమిలో పగుళ్లు ఏర్పడడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ప్రముఖ పర్యాటక కేంద్రంగా పేరుగాంచిన కొడైకెనాల్‌లోని తోలుకం పట్టిలో 200 అడుగుల మేర పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ పగుళ్లు తోలుకంపట్టికి వెళ్లే అడవి మార్గంలో ఏర్పడినట్లు అధికారులు గుర్తించారు. కొండ కింద ఉన్న కీళవళై గ్రామానికి కొళాయి ద్వారా నీరు వెళుతుంటాయి. కొద్దిరోజులుగా నీరు రాకపోవడంతో గ్రామస్తులు కొండమార్గంలోకి వెళ్లగా, అక్కడ భూమిలో పగుళ్లు ఏర్పడడం గుర్తించారు.ఈవ్యవహారంపై పురావస్తుశాఖ అధికారులు పరిశీలిస్తున్నారు.

కోస్ట్ గార్డ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్



పెరంబూర్, సెప్టెంబరు 21: అంతర్జాతీయ సముద్ర తీర శుభ్రత దినోత్సవంలో భాగంగా శనివారం ఇండియన్ కోస్ట్ గార్డ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ చేపట్టారు. స్థానిక మెరీనా, ఎలియాట్స్ బీచ్‌ల్లో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని కోస్ట్‌గార్డ్ ఈస్ట్ రీజియన్ ఐజీ దానీమైఖేల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోస్ట్‌గార్డ్ సిబ్బందితో పాటు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు అని సుమారు 800 మంది పాల్గొని, 450 కిలోల వ్యర్థాలు తొలగించినట్లు అధికారులు తెలిపారు.

కౌన్సెలింగ్ పేరుతో విద్యార్థినులకు వేధింపులు

● సైకాలజిస్ట్ అరెస్టు

అడయార్, సెప్టెంబరు 21: నాగపట్టినం జిల్లా సామంతన్‌పేటలో ప్రభుత్వ అనాథ బాలికల సంరక్షణ కేంద్రానికి చెందిన బాలికలను కౌన్సెలింగ్ పేరుతో లైంగిక వేధింపులకు పాల్పడిన సైకాలజిస్ట్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. 2004లో సంభవించిన సునామీ విపత్తులో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ అనాథ బాలికల కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, ఇందులో 50 మందికిపైగా బాలికలు ఉంటున్నారు. వీరికి కౌన్సెలింగ్ ఇచ్చేందుకు సైకాలజిస్ట్ సత్యప్రకాష్‌ను కాంట్రాక్ట్ విధానంలో నియమించుకున్నారు. ఈ క్రమంలో ఈ కేంద్రానికి చెందిన బాలికలు గత కొంతకాలంగా అదృశ్యమవుతున్నారు. దీనిపై రాష్ట్ర స్త్రీశిశుసంక్షేమ శాఖకు చెందిన జిల్లా అధికారులు తనిఖీలు నిర్వహించడమే కాకుండా, బాలికలను విచారించారు. కౌన్సెలింగ్ పేరుతో సత్యప్రకాష్ చేస్తున్న వేధింపులను పలువురు బాలికలు ఏకరవు పెట్టారు. దీంతో ఆయనపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అలాగే, బాలికలకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు వీలుగా ముగ్గురు మహిళా సైకాలజిస్టులను నియమించారు.

కోవై వద్ద పోలీసుల కాల్పులు

● రౌడీ ఆల్విన్ అరెస్టు



రౌడీ ఆల్విన్ (ఫైల్‌ఫోటో), పోలీసుల కాల్పుల్లో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆల్విన్ - కాల్పులు జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు కొటీషియా మైదానం వద్ద శనివారం వేకువజామున పోలీసులపై కత్తితో దాడి జరిపి పారిపోతున్న రౌడీ ఆల్విన్‌ను తుపాకీతో కాల్పులు జరిపి అరెస్టు చేశారు. ఈ సంఘటనలో ఆల్విన్ రెండు కాళ్లలోనూ తూటాలు దూసుకుపోయాయి. కన్నియాకుమారి జిల్లా నాగర్‌కోవిల్‌కు చెందిన ఆల్విన్ (40) కోయంబత్తూరు నగరంలో నివసిస్తున్నాడు. ఇతడిపై పలు పోలీసుస్టేషన్లలో దోపిడీ, హత్య, హత్యాయత్నం కేసులు నమోదై ఉన్నాయి. కోయంబత్తూరు రేస్‌కోర్సు పోలీసు స్టేషన్‌లో నమోదైన ఓ కేసులో అరెస్టయి బెయిలుపై విడుదలై పరారయ్యాడు. దీంతో అరెస్టు వారెంట్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో శనివారం వేవకుజామున కోయంబత్తూరు అవినాశి రోడ్డు కొటీషియా మైదానం వద్ద ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీవతో కాట్టూరు ఎస్ఐ కార్తికేయన్ నాయకత్వంలో హెడ్‌కానిస్టేబుళ్లు రాజ్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు హుటాహుటిన అక్కడికి వెళ్ళి చుట్టుముట్టారు. కొడవలితో కానిస్టేబుల్ రాజ్‌కుమార్‌పై దాడి జరిపి పారిపోతుండగా ఎస్ఐ తుపాకీతో అతడి కాళ్లపై కాల్పులు జరిపారు. తూటాలు దూసుకెళ్లడంతో రౌడీ ఆల్విన్ ఆ స్థలంలోనే పడిపోగా అంబులెన్స్‌లో కోయంబత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రేమలతకు బెదిరింపు

● పోలీసులకు ఫిర్యాదు

ఐసిఎఫ్, సెప్టెంబరు 21: స్థానిక సాలిగ్రామం కన్నమ్మాళ్ వీధిలో ఉన్న డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత నివాసానికి వచ్చే కొంతమంది ఆమెను బెదిరిస్తున్నారంటూ ఆ పార్టీకి చెందిన విరుగంబాక్కం కార్యదర్శి లక్ష్మణన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాష్ట్రం నలువైపుల నుంచి ఎంతోమంది ఆమె నివాసానికి వచ్చి తమ కష్టనష్టాలు చెప్పుకుని పరిష్కారం పొందుతుంటారని, అలా బాధితుల పేరుతో వచ్చిన కొంతమంది ఆమెను బెదిరించి వెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై తగిన చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు మొదలుపెట్టారు. ఇదిలా వుండగా విజయకాంత్ మరణానంతరం ఆయన నివాసానికి కల్పించిన భద్రతను పోలీసులు గత ఆగస్టులో ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే.

ఎస్ఎస్ బిర్యానీ హోటల్ సీజ్

పెరంబూర్, సెప్టెంబరు 21: స్థానిక పొన్నేరిలోని ఎస్ఎస్ బిర్యానీ హోటల్‌ను ఆహార భద్రతా శాఖ అధికారులు సీజ్ చేశారు. చెన్నై జిల్లా నియామక అధికారి సతీష్‌కుమార్ నేతృత్వంలో ఆహార భద్రతా శాఖ అధికారులు శనివారం హోటల్ తనిఖీలు చేపట్టారు. పొన్నేరి ఎస్ఎస్ హైదరాబాద్ బిర్యానీ హోటల్‌లో రెండు రోజులు క్రితం బిర్యానీ తిని 10 మంది అస్వస్థతకు గురయ్యారనే ఫిర్యాదులతో అధికారులు ఈ చర్యలు చేపట్టారు.

గుజరాత్ ప్రభుత్వానికి విధించిన ఉత్తర్వులపై మద్రాసు హైకోర్టు స్టే

పెరంబూర్, సెప్టెంబరు 21: పాఠశాలల్లో కంప్యూటర్ విద్య బోధించిన ప్రైవేటు సంస్థకు రూ.1.96 కోట్లు అందించాలనే ఉత్తర్వులపై మద్రాసు హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది. లిక్విడేషన్ అధికారికి రూ.1.96 కోట్లు చెల్లించాలని గుజరాత్ ప్రభుత్వానికి సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు దాఖలైన అప్పీలు పిటిషన్ విచారించిన ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం, సింగిల్ జడ్జి ఉత్తర్వులకు తాత్కాలిక స్టే విధించింది.

ఆమ్నీ బస్సు పార్శిల్‌లో రూ.2.15 కోట్ల నగదు స్వాధీనం

పెరంబూర్, సెప్టెంబరు 21: హైదరాబాద్ నుంచి చెన్నైకి వచ్చిన ఆమ్నీ బస్సులో పంపిన పార్శిల్ నుంచి రూ.2.15 కోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు-ఆంధ్ర సరిహద్దుల్లో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో, పార్శిల్‌లో నగదు ఉండడం గుర్తించారు. పార్శిల్ పంపిన సూరజ్ పూరిని ఆదాయపు పన్ను శాఖ అధికారులు విచారిస్తున్నారు.

విష వాయువు సోకి ఇద్దరు కార్మికుల మృతి

పెరంబూర్, సెప్టెంబరు 21: శివగంగ జిల్లాల ఇనయాంకుడి నగర్‌లో విషవాయువు సోకి ఇద్దరు కార్మికులు మృతి చెందారు. ఆ ప్రాంతంలో సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు లోపలికి భాస్కరన్, రామయ్య విషవాయువు సోకి స్పృహతప్పి పడిపోయారు. సహచరులు వారిని వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పాఠశాలల పనితీరుకు కమిటీలు

పెరంబూర్, సెప్టెంబరు 21: పాఠశాల విద్యాశాఖ అమలు చేస్తున్న పథకాల అమలు పర్యవేక్షించేందుకు జిల్లాల వారీగా కమిటీలు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. తిరువళ్లూర్ జిల్లా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అధికంగా చూపి అవినీతికి పాల్పడుతున్న వ్యవహారం ఇటీవల వెలుగులోకి వచ్చింది. అలాగే, విల్లుపురం జిల్లా కోలియనూరులోని ఎయిడెడ్ పాఠశాలల్లోనూ ఇలాంటి అవినీతి జరిగింది. విద్యార్థుల సంఖ్య అధికంగా చూపి అందిస్తున్న సంక్షేమ సహాయాల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇలాంటి అవినీతి అడ్డుకొనేలా జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రత్యేక అధికారులు పాఠశాలలకు వెళ్లి తనిఖీలు చేపట్టి పథకాల అమలు, పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యా బోధన తదితరాలు స్వయంగా పర్యవేక్షించి ప్రతి నెలా 5వ తేది నివేదిక అందజేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.


ఆర్ఎస్ఎస్ కవాతుకు అనుమతివ్వరా?

● ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్

పెరంబూర్, సెప్టెంబరు 21: ఆర్ఎస్ఎస్ కవాతుకు అనుమతివ్వని రాష్ట్ర ప్రభుత్వ తీరును ఖండిస్తున్నట్లు బీజేపీ ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ తెలిపారు. 1925 విజయదశమి రోజున 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం (ఆర్ఎస్ఎస్) ఆవిర్భవించిందన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యేటా కవాతు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోనూ 1940 నుంచి ఈ ప్రదర్శనలు జరుగుతున్నాయన్నారు. ఈ ఏడాది అక్టోబరు 6వ తేది 58 ప్రాంతాల్లో కవాతులు నిర్వహించేందుకు పోలీసు శాఖకు దరఖాస్తు చేయగా, ఇప్పటివరకు అనుమతులు ఇవ్వలేదన్నారు. డీఎంకే అధికారంలో హిందూ సంస్థల కార్యకలాపాలకు అనుమతులివ్వడం లేదని, న్యాయస్థానాల ఉత్తర్వులతో కవాతులను చేపడుతున్నామన్నారు.



చెన్నైలోని వైష్ణవాలయాల కోసం గొడుగులు తయారీలో కళాకారులు





నెమలి పింఛాలతో మాలలు తయారు చేస్తున్న కళాకారులు

SUNDAY SPECIAL

శ్రీహరి గొడుగుల తయారీలో

చింతాద్రిపేట కళాకారులు

చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరవ నెల పురటాసి మాసం. సూర్య భగవానుడు కన్యారాశిలో సంచరించే దినాలనే పురటాసి మాసంగా పిలుస్తున్నారు. మహావిష్ణువును ఆరాధించడానికి అనువైన మాసం కూడా ఇదే. ఈ మాసమంతటా రాష్ట్రంలోని వైష్ణవాలయాలన్నింటిలో ప్రత్యేక పూజలు జరుగుతాయి. మహావిష్ణువుకే కాదు ఆయన సోదరి అంబికాదేవి కూడా భక్తకోటిని అనుగ్రహించే మాసమిదే. పురటాసి శనివారాల్లో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు వ్రతమాచరించటం ఆనవాయితీ. ఇక వేంకటేశ్వర స్వామి పురటాసి మాసంలో వచ్చే శ్రవణా నక్షత్ర పర్వదినంలోనే అవతరించటం విశేషం. ఇంతటి విశేషాలు సంతరించుకున్న ఈ నెలలో చెన్నై నగరంలోని వైష్ణవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతుంటాయి. ఇక చెన్నై నుంచి తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు అందమైన గొడుగులను ఊరేగింపుగా తిరుమలకు తీసుకెళ్లి స్వామివారికి సమర్పించడం దశబ్దాల తరబడి పండుగలా నిర్వహించ డం ఆనవాయితీ. నగరంలోని చింతాద్రిపేటలోని కొన్ని కళాకారుల కుటుంబాలు ఈ గొడుగుల తయారీ, స్వామివారికి వివిధ సుగంధ ద్రవ్యాలతో రూపొందించిన మాలలను కట్టడంతో ఆరితేరి ఉన్నాయి. ఇక నగరంలోని అన్ని వైష్ణవాలయాలకు కూడా ఈ ప్రాంతానికి చెందినవారే ఏలకుల మాలలు, జీడిపప్పు మాలలు, బాదం పప్పులతో అందమైన మాలలు అందిస్తున్నారు. ఇదే విధంగా వట్టివేర్లతోనూ, నెమలి పింఛాలతోనూ స్వామివారికి ప్రత్యేక మాలలను రూపొందిస్తారు.



అందమైన గొడుగులు

ప్రస్తుతం వివిధ సంఘాలవారిచ్చిన ఆర్డర్ల మేరకు అందమైన గొడుగుల తయారీలో ఇక్కడి కళాకారులు నిమగ్నమై ఉన్నారు. కళాత్మకమైన గొడుగులను తయారు చేయడాన్ని స్వామివారి కార్యంగా భావిస్తారు. తిరుపతి గొడుగులు పట్టువస్త్రం, వెదురు, జరిగె వంటి వస్తువులతో ఏడు అడుగుల వ్యాసం, ఏడడుగులు ఎత్తుతో తయారు చేస్తారు. ఈ పనుల్లో యేటా చింతాద్రిపేట కళాకారులు అంకితభావంతో పనిచేస్తారు. చెన్నకేశవ పెరుమాళ్ గుడిలో ఈ గొడుగులు తయారవుతాయి. కనుకనే చెన్నై నుంచి వచ్చే ఈ అందమైన గొడుగులు తిరుమలేశుడి శోభను మరింతగా పెంచుతుందనటం అతిశయోక్తి కాదు. అందమైన గొడుగులు భక్తులను మైమరపిస్తాయని వామనావతార ఘట్టం రుజువు చేస్తుంది. పెరుమాళ్ వామనావతారంలో మహాబలి చక్రవర్తి వద్ద మూడడుగుల నేలను దానంగా పొందటానికి వెళతారు. మూడడుగుల భూమిని దానంగా అడిగేందుకు మహావిష్ణువే వామనుడి రూపంలో వచ్చాడని బలిచక్రవర్తికి మంత్రులు, ఆస్థాన పండితులు పదేపదే చెప్పినా వినిపించుకోకపోవడానికి వామనుడి ముఖారవిందంతోపాటు ఆయన చేతిలో ఉన్న అందమైన ఛత్రం (గొడుగు) అందానికి ఫిదా అయిపోయి, మూడడుగుల నేలను దానంగా ఇస్తానని చెప్పి ఆ పొట్టి వామనుడి చేత పాతాళానికి అణగ దొక్కబడ్డాడని పురాణగాథ. ఇలా మహావిష్ణువు అవతారంలో ఈ గొడుగు ప్రాధాన్యం సంతరించుకుంది. ఆ రీతిలోనే చింతాద్రిపేట కళాకారుల కుటుంబాలు శ్రీవారికి అందమైన గొడుగులు తయారు చేస్తున్నాయి. ఈ గొడుగులు తిరుమలేశుడి బ్రహ్మోత్సవాల్లో స్వామి వారి ఊరేగింపు వేడుకలలో ప్రత్యేక ఆకర్షణగాను నిలుస్తున్నాయి. ఇంతటి విశేషాలు కలిగిన ఆ గొడుగుల తయారీ పురటాసి మాసం ఆరంభంలోనే ప్రారంభం కావటం విశేషమే కదా!



ఏలకుల మాల తయారీలో నిమగ్నమైన కళాకారుడు

ఫీల్‌గుడ్ మూవీ 'బ్రదర్'

● జయం రవి

దీపావళికి విడుదలయ్యే చిత్రాల్లో మంచి ఫీల్‌గుడ్ మూవీగా 'బ్రదర్' ఉంటుందని ఆ చిత్ర హీరో జయం రవి అన్నారు. స్క్రీన్ సీన్ మీడియా ఎంటర్‌టైన్మెంట్ ప్రైవేటు లిమిటెడ్ పతాకంపై ఎం.రాజేష్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఆడియోను శనివారం నగరంలో విడుదల చేశారు. జయం రవి, ప్రియాంకా అరుళ్ మోహన్ జంటగా నటించగా, సీనియర్ నటి భూమిక ఇందులో హీరోకు అక్క పాత్రను పోషించారు. ఇతర పాత్రల్లో నటరాజ్ సుబ్రమణియన్, రావు రమేష్, అచ్యుత్ కుమార్, శరణ్య పొన్‌వన్నన్, సీత, సతీష్ కృష్ణన్, ఎంఎస్ భాస్కర్, సురేష్ చక్రవర్తి, మాస్టర్ అశ్విన్ పోషించారు. హ్యారీస్ జయరాజ్ సంగీతం అందించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని అక్టోబరు 31న విడుదలకానుంది. ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా, ఆడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా జయం రవి మాట్లాడుతూ... 'కథ ఎంతో ఆహ్లాదకరంగా సాగిపోతుంది. కుటుంబంతో కలిసి థియేటర్‌కు వెళ్లి చూడొచ్చు. ఒక ఫీల్‌గుడ్ మూవీని చూశామన్న అనుభూతి కలుగుతుంది. మంచి కుటుంబ కథా చిత్రానికి ఎలాంటి టైటిల్ పెట్టాలన్న అంశంపై యూనిట్ సభ్యులంతా కొన్ని నెలల పాటు తర్జనభర్జనలు పడ్డాం. చివరకు 'బ్రదర్' అనే టైటిల్ పెడితే బాగుంటుందని నేను సూచించా' అన్నారు. దర్శకుడు ఎం.రాజేష్ మాట్లాడుతూ... 'అన్ని వర్గాల ప్రేక్షకులు చూసి ఆనందించే కుటుంబ కథా చిత్రంగా నిలుస్తుంది. హాస్యం, మాస్, ఎమోషన్ ఇలా అన్ని రకాల ఎలిమెంట్స్ సమపాళ్లలో ఉన్నాయి' అన్నారు. ఈ ఆడియో రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా వచ్చిన దర్శకుడు మోహన్‌రాజా మాట్లాడుతూ... 'నా తమ్ముడు అన్ని రకాల పాత్రలను అవలీలగా పోషించగలడు. ముఖ్యంగా డ్యాన్స్ అద్భుతంగా చేస్తాడు. తమిళ చిత్ర పరిశ్రమంలో డ్యాన్స్ బాగా చేసే టాప్-5 హీరోల్లో ఒకరు అని గర్వంగా చెప్పగలను. చిత్రపరిశ్రమలో రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్నాడు. అన్ని రకాల పాత్రల్లో నటించి ప్రేక్షకులను అలరించడమంటే సాధారణ విషయం కాదు. ఈ సినిమా చూశాను. చాలాబాగా వచ్చింది' అన్నారు. అలాగే, హీరోయిన్ ప్రియాంకా అరుళ్ మోహన్, నటి భూమిక, సంగీత దర్శకుడు హ్యారీస్ జయరాజ్ తదితరులు మాట్లాడారు.



జయం రవి, హ్యారీస్ జయరాజ్

డిజిటల్ లైసెన్స్ విక్రయాల్లో 'థగ్‌లైఫ్' రికార్డు : మణిరత్నం



శింబు, కమల్, మణిరత్నం, సుహాసిని తదితరులు

విశ్వనటుడు కమల్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'థగ్‌లైఫ్' చిత్ర షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ చిత్రం డిజిటల్ లైసెన్స్ విక్రయాల్లో సరికొత్త రికార్డును నెలకొల్పిందని చిత్ర దర్శకుడు మణిరత్నం తెలిపారు. మద్రాస్ టాకీస్, రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో కమల్, శింబు, అభిరామి, అశోక్ సెల్వన్ తదితరులు నటించారు. ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం. ఈ సినిమా షూటింగ్‌ను సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేశారు. ఆ వెంటనే ఈ సినిమా డిజిటల్, శాటిలైట్ రైట్స్‌ను విక్రయించింది. డిజిటల్ రైట్స్‌ను రూ.149.7 కోట్లకు విక్రయించినట్టు దర్శకుడు మణిరత్నం తెలిపారు. ఇప్పటివరకు తమిళ చిత్రపరిశ్రమలో అత్యధిక ధరకు అమ్ముడుపోయిన చిత్రంగా నిలిచింది. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటోంది. వచ్చే యేడాది వేసవికి ఈ చిత్రాన్ని విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నారు.

శరత్ కుమార్, షణ్ముగ పాండ్యన్ ప్రధాన పాత్రల్లో కొత్త చిత్రం

శరత్ కుమార్, షణ్ముగ పాండ్యన్ కలిసి నటించే తొలి చిత్రం పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. వీరిద్దరు తొలిసారి వెండితెరను షేర్ చేసుకుంటున్నారు. దీంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా నెలకొన్నాయి. స్టార్ సినిమాస్ ముకేష్ టి చెల్లయ్య నిర్మాణంలో పొన్‌రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతం. కామెడీ, యాక్షన్ కలిసిన కమర్షియల్ సినిమాగా రూపొందించనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం యువన్ - పొన్‌రామ్ తొలిసారి పని చేస్తున్నారు. హీరోయిన్‌గా తార్నిక నటిస్తున్నారు. ఈమెకు ఇదే తొలి చిత్రం. ఇతర పాత్రల్లో కాళి వెంకట్, మునీష్‌కాంత్, కల్కి రాజా పోషిస్తుండగా బాలసుబ్రమణ్యం ఛాయాగ్రహణం అందిస్తున్నారు. తేని, ఆండిపట్టి, ఉసిలంపట్టి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకోనుంది. షూటింగ్‌ను తేనిలో ప్రారంభించి, శరవేగంగా జరుపుతున్నారు.



కొత్త చిత్రం ప్రారంభోత్సవ దృశ్యం

చిత్రజ్యోతి

హీరోయిన్ పార్వతి నాయర్‌పై కేసు నమోదు

ఇంట్లో పని మనిషిపై దాడి చేసిన ఘటనకు సంబంధించి హీరోయిన్ పార్వతి నాయర్ సహా మొత్తం ఏడుగురిపై మూడు సెక్షన్ల కింద తేనాంపేట పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. 'ఎన్నై అరిందాల్', 'ఉత్తమ విలన్', 'నిమిర్' వంటి పలు చిత్రాల్లో నటించిన పార్వతి నాయర్... ఇటీవల విడుదలైన విజయ్ 'ది గోట్' లో కూడా నటించారు. నుంగంబాక్కంలో ఉంటున్నారు. 2022లో తన నివాసంలో రూ.10 లక్షల నగదు, ఐఫోన్, ఖరీదైన చేతి గడియారం, ల్యాప్‌టాప్ చోరీకి గురైనట్టు నుంగంబాక్కం పోలీసులకు ఫిర్యాదు చేసి, వీటిని తన ఇంట్లో పనిచేసే పుదుపేటకు చెందిన సుభాష్ చంద్రబోస్‌పై సందేహం ఉన్నట్టు పేర్కొన్నారు. ఇదిలావుండగా సుభాష్ కూడా తేనాంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పార్వతి నాయర్ సహా ఏడుగురు తనను ఓ గదిలో బంధించి చిత్రహింసలకు గురి చేయడమేకాకుండా భౌతికంగా దాడి చేశారంటూ పేర్కొన్నారు. కానీ, తన ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని సైదాపేట మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు గత ఆగస్టు 29న కేసు నమోదుకు ఆదేశించింది. అయినప్పటికీ తేనాంపేట పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో మరోమారు కోర్టును ఆశ్రయించాడు. దీనిపై శుక్రవారం విచారణ జరగగా, పార్వతి నాయర్, కె.రాజేష్, అరుణ్ మురుగన్, ఇళంగోవన్, సెంథిల్, అజిత్ భాస్కర్ సహా ఏడుగురిపై మూడు సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని ఆదేశించింది. దీంతో తేనాంపేట పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.



పార్వతి నాయర్

బీజేపీ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం

● 2026లో రాష్ట్ర ప్రభుత్వం మాదే ● కేంద్రమంత్రి ఎల్ మురుగన్ జోస్యం

చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2026లో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాల్లో గెలిచి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ జోస్యం చెప్పారు. శనివారం ఉదయం ఆయన తిరుచెందూరులో సెంథిల్ ఆండవర్ ఆలయానికి మూలవిరాట్టు, షణ్ముఖుడిని, వళ్ళీ, దేవసేన అమ్మవార్లను, గురు భగవానుడిని, శత్రు సంహార సన్నిధిని దర్శించారు. ఆ తర్వాత ఆలయానికి చేరువగా నిర్వహించిన శత్రుసంహార యాగంలో పాల్గొన్నారు. ఆలయం నుంచి వెలుపలకు వచ్చాక ఐరన్ ఆర్చ్ ప్రాంతం వద్ద నిర్వహించిన బీజేపీ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ ప్రాంతంలోని దుకాణాల వద్దకు వెళ్లి కొత్త సభ్యులకు పార్టీ సభ్యత్వం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధాని పదవిని చేపట్టి వందరోజులు పూర్తయిన సందర్భంగా వంద రోజుల్లో రూ.15లక్షల కోట్ల విలువైన పథకాలను అమలు చేశారని చెప్పారు. దేశంలో మౌలిక సదుపాయాల కల్పన కోసమే రూ.3 లక్షల కోట్లు కేటాయించారని చెప్పారు. అందరికీ గృహ నివాస పథకం కింద మహిళల పేరిట 3 కోట్ల ఇళ్ల నిర్మించేందుకు అనుమతి జారీ చేశారని తెలిపారు. ముద్రా లోన్ పరిమితిని రూ.20లక్షలకు పెంచినట్లు చెప్పారు. రాష్ట్రంలోని 11 నగరాలు సహా దేశవ్యాప్తంగా ఉన్న బీ, సీ, నగరాల్లో ఎఫ్ఎం రేడియో స్టేషన్లు ఏర్పాటు చేయడానికి అనుమతి జారీ చేసినట్లు తెలిపారు. ఒకే దేశం ఒకే ఎన్నికల అమలుకు విద్యావేత్తలు, మేధావులు, న్యాయమూర్తులు, వైస్‌ఛాన్సలర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహా పలు వర్గాల నుంచి అభిప్రాయాలు సేకరించినట్లు మంత్రి మురుగన్ తెలిపారు. 2047లోగా దేశాన్ని సంపన్నదేశంగా మార్చాలంటే వ్యయభారాలను వీలైనంత మేరకు తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ మేరకే ఒకే దేశం ఒకే ఎన్నికల విధానాన్ని అమలు చేయడానికి బీజేపీ ప్రభుత్వం సిద్ధమవుతోందన్నారు. పీఎంశ్రీ పథకాన్ని అంగీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సంతకం పెట్టిందని, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధులకు కొన్ని పరిమితులు ఉన్నాయని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పెట్టుబడుల సమీకరణ కోసం అమెరికా పర్యటన గురించి ఎవరూ నోరుమెదపకుండా ఉండేందుకే డీపీఐ, డీఎంకే కలిసి ఆడిన కపట నాటకమే మద్యపాన నిషేధ మహానాడు అని మురుగన్ విమర్శించారు. తమిళ జాలర్లు అరెస్టయినప్పుడల్లా కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ త్వరితగతిన వారిని విడుదల చేయడానికి తక్షణ చర్యలు చేపడుతూనే ఉందన్నారు. జాలర్లు భారత సముద్రజాల సరిహద్దులు దాటి వెళ్ళకుండా ఉండేందుకే జాలర్లకు జీపీఎస్ పరికరాలను సమకూర్చినట్లు ఆయన చెప్పారు. ఉదయనిధి డిప్యూటీ ముఖ్యమంత్రి అయినంత మాత్రాన రాష్ట్రం అభివృద్ధి చెందగలదా అని ఆయన ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే టాస్మాక్ దుకాణాల సంఖ్యను తగ్గిస్తామంటూ హామీ ఇచ్చిన స్టాలిన్ ముఖ్యమంత్రి అయ్యాక వాటి సంఖ్యను పెంచేందుకే చర్యలు చేపడుతున్నారని విమర్శించారు.



తిరుచెందూరులో శత్రు సంహార యాగంలో పాల్గొన్న మురుగన్

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

● మంత్రి టీఆర్‌బీ రాజా ● ఘనంగా టెక్నో వీఐటీ ముగింపు వేడుకలు

ప్యారీస్, సెప్టెంబరు 21: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని, ఇందుకోసం ప్రత్యేకంగా ప్రారంభించిన స్టార్టప్ టీఎన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా పేర్కొన్నారు. చెన్నై వండలూరు - కీలంబాక్కం రోడ్డులో ఉన్న వీఐటీ చెన్నై క్యాంపస్‌లోని మహాత్మాగాంధీ ఆడిటోరియంలో శనివారం మధ్యాహ్నం టెక్నో వీఐటీ -2024 ముగింపు వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ టి.త్యాగరాజన్ స్వాగతం పలికారు. వీఐటీ చెన్నై వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శేఖర్‌విశ్వనాథన్ అధ్యక్షోపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలకు వీఐటీ తగు సహకారం అందిస్తుందని, ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ విద్యార్థులు అభ్యసిస్తున్న కోర్సులకు అవసరమైన సాంకేతికతను సమకూరుస్తున్నారని చెప్పారు. అదే విధంగా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది దేశానికి అందించగలుగుతున్నారని చెప్పారు. అనంతరం మంత్రి రాజా, గౌరవ అతిథి స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఇమ్మని దీపా వెంకట్ వీఐటీ -24 ఆఫ్టర్ మూవీ అండ్ మ్యాగజీన్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ... స్టార్టప్ టీఎన్ పథకంలో చేరుతున్న యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన పెట్టుబడులను ప్రభుత్వమే పలు బ్యాంకుల ద్వారా ఇప్పిస్తుందన్నారు. నాణ్యమైన ఉత్పత్తులను అందించాలన్న లక్ష్యంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కృషి చేయాలన్నారు. విద్యార్థులు రాజకీయాల్లోకి వచ్చి ఆరోగ్యవంతమైన సమాజం కోసం పాటుపడాలని కోరారు. వాట్సప్ మెసేజ్‌లను చూడగానే నమ్మరాదని వాటిని నిశితంగా పరిశీలించాలన్నారు. దేశంలో ఎలాంటి మార్పు కావాలో ఆలోచించి మంచి నిర్ణయంతో యువత ముందుకెళ్లాలని అన్నారు. ముఖ్యంగా నేటి పోటీ ప్రపంచంలో విదేశాల్లో తయారవుతున్న ఉత్పత్తులకు మంచి డిమాండ్ పెరిగిందని, భారత దేశానికి ఘనత చేకూర్చే విధంగా మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులను తయారు చేసే విధంగా ఉన్నత విద్యనభ్యసించిన విద్యార్థులు తయారు కావాల్సిన అవసరం ఉందన్నారు. వీఐటీ విద్యాసంస్థలు అంతర్జాతీయవిద్యా ప్రమాణాలతో విద్యార్థులను ఉన్నతవంతులుగా తీర్చిదిద్దటం ప్రశంసనీయం అని, ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహకారం ఉంటుందని మంత్రి సభాముఖంగా హామీ ఇచ్చారు. అనంతరం దీపా వెంకట్ మాట్లాడుతూ.. సుమారు 16 దేశాలకు చెందిన 23 వేల మంది విద్యార్థులు వీఐటీ చెన్నై క్యాంపస్‌లో చదువుకుంటూ ఐక్యత చాటుకోవడం అభినందనీయమన్నారు. ఛాన్సలర్ జి.విశ్వనాథన్ కుటుంబం విద్యారంగానికి ఎనలేని సేవలందిస్తోందన్నారు. విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నైపుణ్యం కలిగిన శాస్త్రవేత్తలు, ఇంజనీర్‌లుగా ఎదగాలని ఆకాంక్షించారు. స్వర్ణభారత్ ట్రస్టు తమ తండ్రి భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడి విజన్ అని, దీని ద్వారా నెల్లూరు, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఉచిత శిక్షణలందిస్తున్నట్లు దీపావెంకట్ తెలిపారు. అతిథులును నిర్వాహకులు ఘనంగా సత్కరించి అనంతరం వివిధ పోటీలకు సంబంధించిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. వీఐటీ చెన్నై స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ వి.రాజశేఖరన్ వందన సమర్పణ చేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి టీఆర్‌బీ రాజా, దీపా వెంకట్

మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కేఆర్ శ్రీరామ్



మద్రాసు హైకోర్టు కొత్త సీజే కేఆర్ శ్రీరామ్

పెరంబూర్, సెప్టెంబరు 21: మద్రాసు సహా 8 హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులు నియమితులయ్యారు. ముంబై హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్ మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న ఆర్.మహాదేవన్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులు కావడంతో, సీనియర్ న్యాయమూర్తి కృష్ణ కుమార్ ప్రస్తుతం ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, కొత్త సీజేగా నియమితులైన కేఆర్ శ్రీరామ్ చేత రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి త్వరలో పదవీ ప్రమాణం చేయించనున్నారు. అలాగే, జిల్లా న్యాయమూర్తి హోదాలో ఉన్న ఆర్.పూర్ణిమ, జ్యోతిరామన్, ఆగస్టిన్ దేవదాస్ మరియు హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు.

చెన్నై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను సతీసమేతంగా కలుసుకుని తమ కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎండీఎంకే ఎంపీ దురై వైగో

